క్లుప్తంగా

చేయూత



బాధితులను ఓదారుస్తున్న స్నేహితులు

లింగాలఘణపురం: క్లాస్‌లో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన యాకూబ్‌పాషా కుటుంబానికి చిన్ననాటి 2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్‌ను కుటుంబానికి అందజేసి చేయూతనందించారు. చిన్న వయసులోనే గుండెపోటుతో మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కులేనిదయ్యిందని, పేద కుటుంబానికి స్నేహితులం అండగా ఉంటామని వారు చెప్పారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న విష్ణు

చిల్పూరు: పేదింటి పెళ్లికి హైదరాబాద్‌లోని ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ పొగాకుల విష్ణువర్ధన్ ఆర్థికసాయం అందించి చేయూతనందించారు. సోమవారం ఎన్యానాయక్‌తండాకు చెందిన శంకర్‌నాయక్ కుమార్తె స్వాతి వివాహానికి శ్రీపతిపల్లికి చెందిన విష్ణువర్ధన్ రూ.40వేల సాయం అందజేశారు.

'మభ్యపెట్టేందుకే ఎల్కతుర్తి సభ'

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజలను మభ్యపెట్టేందుకే ఎల్కతుర్తిలో రజతోత్సవ సభను బీఆర్‌ఎస్ నిర్వహిస్తుందని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్రవేదిక చైర్మన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌పై మండిపడ్డారు. రాష్ట్రప్రజలు రెండుసార్లు అధికారమిస్తే కేసీఆర్ తెలంగాణ ప్రజలపై తీవ్ర నిర్బంధాలను, దోపిడీని, కుటుంబ కుల ఆధిపత్యాన్ని చెలాయించాడని, మరోసారి కేసీఆర్‌ను నమ్మేస్థితిలో ప్రజలు లేరని, కల్వకుంట కుటుంబ నిరంకుశ దోపిడీ దొరల ఆటలు ఇక సాగవన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ కుటుంబం రాజకీయాలు వదిలి విశ్రాంతి తీసుకుంటే ప్రజలు ప్రశాంతంగా ఉంటారన్నారు. అక్రమంగా సంపాదించిన వేలకోట్ల రూపాయలతో ప్రజలను మరోసారి మభ్యపెట్టి మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని, ఈ క్రమంలోనే ఎల్కతుర్తిలో సభ నిర్వహిస్తున్నారని, ప్రజలు, ఉద్యమకారులు వారి కుటిల ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించాలని ఆయన కోరారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక నాయకులు బీనవేని ప్రభాకర్ గౌడ్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు బోసు ఐలయ్య, బోసు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

పాలకుర్తి: అప్పుల బాధ భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని వావిలాల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వనపర్తి లచ్చమ్మ (50) అప్పులతో ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో అప్పుల బాధ భరించలేక వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.పవన్‌కుమార్ తెలిపారు.

కేసు నమోదు

బచ్చన్నపేట: ఆర్టీసీ అధికారులపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ హమీద్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఆదివారం రాత్రి జనగామ ఆర్టీసీ డిపో బస్సు జనగామ నుంచి చేర్యాలకు వెళ్తుండగా బచ్చన్నపేట బస్టాండ్‌లో నిలిపారు. అక్కడ కొందరు ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేసి ఉండగా బస్సు మలుపు తుండగా ఓ ద్విచక్ర వాహనానికి తగిలింది. దీంతో అక్కడే ఉన్న వాహనదారులు గొల్లూరి ప్రదీప్, పైండ్ల బాలకృష్ణ ఆర్టీసీ డ్రైవర్లు లింగం, అలీ, కండక్టర్ శ్రీధర్‌లపై దాడి చేయగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి వారిని తరలించారని తెలిపారు.

తాగునీటికి కటకట

- సిరిపురంలో ఎండిపోయిన బోర్లు
- నిర్వహణ లోపంతో మరింత తిప్పలు
- రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు

లింగాలఘణపురం: మండలంలోని సిరిపురంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. రెండు నెలలుగా నీళ్లు సరిగా రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండుమూడు రోజులకు ఒకసారి కూడా నీళ్లు రావడంలేదని మొరపెట్టుకుంటున్నారు. గ్రామంలో 1,460 మంది జనాభా ఉండగా ఒకటి 60వేలు, మరొకటి 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. మిషన్ భగీరథ పైపులైన్ గ్రామంలోని అన్నీ ఇళ్లకు లేదు. బీసీ కాలనీలో బోరుతో సరఫరా చేయడం జరుగుతోంది. ఆ బోరు భూగర్భ జలాలు అడుగంటడంతో ఎండిపోయి తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా గ్రామంలో ఉన్న చేతిపంపులన్నీ ఎండిపోయాయి. ఇదిలా ఉండగా నిర్వహణ సరిగా లేకపోవడంతో ట్యాంక్‌లు నిండి ఒక్కొక్కసారి నీళ్లని వృథాగా పోతున్నాయని కొందరు గ్రామస్తులంటున్నారు. గ్రామంలోని జనాభాను బట్టి మిషన్ భగీరథ నీటితో రోజుకు ఒకటిన్నర ట్యాంకును నింపాల్సి ఉండగా నిబంధనల ప్రకారం నింపుతున్నామని గ్రిడ్ ఏఈ శ్రీనివాసు తెలుపుతుండగా గ్రామంలో డిమాండ్ ప్రకారం రోజుకు రెండుసార్లు నింపడంలేదని, దీనికి తోడు గ్రామంలో ఉన్న తాగునీటి బోరు ఒకటి పూర్తిగా ఎండిపోవడంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయని కార్యదర్శి శంకర్ చెబుతున్నాడు. ఏదీఏమైన రెండు నెలలుగా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మహిళలంతా మొరపెట్టుకున్నారు. ఎమ్మెల్యేకు సమస్య విన్నవించి పది రోజులు గడిచినా సమస్య పరిష్కారం కాలేదు.



భూగర్భ జలాలు అడుగంటడంతో ఎండిపోయిన బోరు



ఓవర్‌హెడ్ ట్యాంక్

రెండు నెలల నుంచి నీళ్లొస్తలేవు..



రెండు నెలలుగా నీళ్లు సరిగా రావడంలేదు. రెండు మూడు రోజులకు ఒక్కసారి కూడా రాక ఇబ్బంది పడుతున్నాం. చేతనైనోళ్లు ఎక్కడికైనా పోయి తెచ్చుకుంటరు. చేతగాని దాన్ని ఎక్కడి కెళ్లి తెచ్చుకోవాలి.

- చీటకోడూరు లక్ష్మి, సిరిపురం

నిబంధనల ప్రకారం నింపుతున్నాం..

గ్రామంలోని జనాభాను బట్టి నిబంధనల మేరకు ఒకటిన్నర ట్యాంకును ప్రతి రోజు నింపుతున్నాం. ఇంటర్నల్‌గా నిర్వహణ సరిగాలేక అందరికి నీళ్లు అందకపోవచ్చు. మిషన్ భగీరథ నీళ్లు మాత్రం ప్రతి రోజు వస్తున్నాయి.

- శ్రీనివాసు, గ్రిడ్ ఏఈ, మిషన్‌భగీరథ

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తున్న కేంద్రం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

జనగామ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను మోదీ ప్రభుత్వం కొనసాగిస్తుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అంబేడ్కర్‌పై కాంగ్రెస్ చేసిన అవమానాలు అనేకం ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఆరుట్ల దశమంతరెడ్డి, కేవీఎల్‌ఎన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి శివరాజ్ యాదవ్, రాజశేఖర్, ఉమారాణి, ఎల్లయ్య, హరిచంద్ర గుప్తా, డాక్టర్ భిక్షపతి మహిళా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి, మాధవి లత, శశిధర్ రెడ్డి మహేందర్, జగదీష్, అనిల్, నవీన్, శ్రీనివాస్‌రెడ్డి, మైపాల్, సంతోష్, నవీన్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



మాట్లాడుతున్న డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ఈనెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను పురస్కరించుకుని మండలంలోని సముద్రాల గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాజయ్య మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనయే లక్ష్యంగా ఏర్పడిన బీఆర్‌ఎస్ పార్టీ ఉద్యమనేత కేసీఆర్ నాయకత్వంలో అలుపెరుగని ఉద్యమాలు చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకున్నామని, అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పాలకులు తెలంగాణను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అబ్జర్వర్, రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, మాజీ జెడ్పీటీసీ మారపాక రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు



రఘునాథపల్లి: బడిబాట ర్యాలీలో ఎంఈఓ రఘునందన్‌రెడ్డి తదితరులు

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులతో పాటు అర్హత గల ఉపాధ్యాయులు బోధిస్తున్నట్లు పలు మండలాల ఎంఈఓలు, పాఠశాలల హెచ్‌ఎంలు అన్నారు. సోమవారం జిల్లాలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులను కలిసి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చాలి'



మాట్లాడుతున్న రమేశ్

జనగామ రూరల్: ఎన్నికలకు ముందు గొల్లకురుమలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి సాదం రమేశ్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీరప్ప గుడి కమిటీ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు మోటే దేవేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు గొల్లకురుమలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చకపోవడం దారుణమన్నారు. సొసైటీ ఎన్నికలు నిర్వహించడంలో అధికారుల అలసత్వం విడాలన్నారు. గొల్లకురుమలు హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి, బూమాండ్ల కుమారాస్వామీ, గద్ద రాజు, నాయిని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

'వాన్స్ గో బ్యాక్'



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

జనగామ రూరల్: స్వేచ్ఛ, వాణిజ్యం పేరుతో దేశ పర్యటనకు వస్తున్న అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ గో బ్యాక్ అంటూ రైతు సంఘం, కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్, రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమయ్య మాట్లాడారు. పరిశ్రమలు, వ్యవసాయ రంగాన్ని ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచనలను కేంద్రం విరమించుకోవాలన్నారు. అజ్మీరా సురేష్, రామావత్ మీట్యా నాయక్, కొన్నె బోయిన రఘు, వెంకటాద్రి, జోగు కృష్ణ, సత్తయ్య, గుర్రం మధు, కర్రె సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నిడిగొండలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని వినతి

రఘునాథపల్లి: జాతీయ రహదారిలోని నిడిగొండ వద్ద హైవే విస్తరణలో ఆర్టీసీ బస్‌షెల్టర్ కొల్పోవడంతో మండుటెండలో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని రఘునాథపల్లికి చెందిన సామాజికవేత్త బిర్రు సతీష్ కోరారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. తమ వినతికి అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని సతీష్ తెలిపారు.

హాస్టల్ భవనాన్ని ఉపయోగంలోకి తేవాలి

లింగాలఘణపురం: మండల కేంద్రంలో మోడల్ స్కూల్ పరిధిలో ఉన్న అసంపూర్తి హాస్టల్ భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ఉపయోగంలోనికి తేవాలని సోమవారం గ్రీవెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌కు వీడీసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. 2014 నుంచి భవనాన్ని పూర్తి చేయకపోవడంతో విద్యార్థులు హాస్టల్ వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకుని వచ్చే విద్యాసంవత్సరం వరకు పూర్తి చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సభ్యులు మల్లేశం, ఉపేందర్, మురళి, శ్రీనివాసు, రాంచందర్, రవి, శ్రీహరి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నర్సింహారెడ్డి

నర్మెట: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి అన్నారు. గండిరామారంలో ఐకేపీ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ, మార్కెట్ డైరెక్టర్ యసర్ల అంజయ్య, సీసీ గద్దల కనకరాజు, అంబేడ్కర్ మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుప్పుడు వాణి, జినుక లక్ష్మి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తివేయాలి



నిరసన తెలుపుతున్న గీత కార్మికులు

జనగామ రూరల్: నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో ఆరు నెలలుగా కల్లు గీత కార్మికులపై వేసిన సాంఘిక బహిష్కరణను ఎత్తివేసి, వీడీసీలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్య కోరారు. ఈ మేరకు మండలంలోని పసరమడ్ల గ్రామంలో గీత కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటమల్లయ్య మాట్లాడుతూ అక్కడి కలెక్టర్, ఉన్నతాధికారులు తక్షణమే ఆ గ్రామాన్ని సందర్శించి గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుర్రేముల సిద్దయ్య, కొర్రెముల పరశురాములు, మార్క ఉపేందర్, చంద్రమౌళి, తాండూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి



బాలింతలు, గర్భిణులకు కోడి గుడ్లు అందజేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి అన్నారు. మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన పోషణ పక్షోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల వైద్యాధికారి సృజన, సూపర్‌వైజర్లు మనోహర, కవిత, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' సేవలను సద్వినియోగం చేసుకోవాలి

దేవరుప్పుల: అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి దిశలో పనిచేసే అంగన్‌వాడీ కేంద్రాల సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి గుంటిపల్లి కళావతి సూచించారు. సోమవారం చిన్నమడూరులో పోషణ పక్షోత్సవాల సందర్భంగా సీడీపీఓ సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సూపర్‌వైజర్ శ్రీదేవి, పీఎస్ పీఎస్ హెచ్‌ఎం మాధవి, సఖీ ప్రతినిధురాలు సంధ్య, హేమంత్, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూమిలో కనీల తొలగింపు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని తహసీల్ కార్యాలయం వెనుకవైపున సర్వేనంబర్ 674లో ఉన్న వక్ఫ్‌బోర్డు భూమిలో పాతిన కనీలను స్థానిక ముస్లింమైనార్టీ నాయకులు సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేనంబర్ 674లోని ముస్లిం వక్ఫ్‌బోర్డు భూమి అన్యాక్రాంతం అవుతుందనే ఫిర్యాదుల మేరకు 2024, జూలై 11వ తేదీన స్వయంగా డీఐ సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే ఇటీవల గుర్తు తెలియనివారు వక్ఫ్‌బోర్డుకు చెందిన భూమిలో కనీలను పాతించారని, ఈ విషయమై స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి ఆదేశాల మేరకు సదరు కనీలను తొలగించామని, ఎవరైనా వక్ఫ్‌బోర్డు భూమిని అన్యాక్రాంతం చేస్తే సహించేది లేదన్నారు. నాయకులు తోట రమేష్, షేక్ అమ్జద్ పాషా, మీర్జా రహీంబేగ్, సాదిక్‌పాషా, కుదురత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన మాలమహానసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

జనగామ: ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్‌ను మాలమహానసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాటికుమార్ సోమవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడుకోవడం జరిగిందన్నారు.

93వ రోజుకు చేరుకున్న సీపీఎం రిలే దీక్షలు

జనగామ రూరల్: బాణాపురంలో అండర్ పాస్ నిర్మించాలని సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 93వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో బొల్లం శారమ్మ, లక్ష్మి, పారిజాత, స్వప్న, మల్లం నరసమ్మ, నల్ల కవిత, మచ్చ సాయి కుమార్ పాల్గొన్నారు.

ఖిలాషాపూర్‌లో సమ్మర్ క్యాంప్

రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌లో పూర్వ విద్యార్థుల కార్పస్ ఫండ్ ద్వారా మండలంలోని పాఠశాలల విద్యార్థులు, యువతకు సమ్మర్ క్యాంపులు నిర్వహించనున్నట్లు సరాబు శ్రీనివాస్, ఆలేటి యాదవరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలియచేశారు. ఖిలాషాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 25 నుంచి మే 9వ తేదీ వరకు 3,4,5 తరగతుల విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, ఖిలాషాపూర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25 నుంచి మే 12వ తేదీ వరకు 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువత స్కిల్ డెవలప్ కోసం సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 8466033098, 9849760972 నంబర్లలో సంప్రదించాలని వారు తెలిపారు.

తలుపుతడుతున్న ముసుగు వ్యక్తులు

- భయాందోళనలో అక్కరాజుపల్లి గ్రామస్తులు



అక్కరాజుపల్లి గ్రామం, (ఇన్‌సెట్‌లో) నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరా

తరిగొప్పుల: ముసుగు (మంకీ క్యాప్) ధరించిన వ్యక్తులు అర్ధరాత్రి తలుపుతడుతూ గ్రామస్తులకు కంటి నిండా కునుకు లేకుండా చేస్తున్నారు. వారం రోజులుగా మండలంలోని అక్కరాజుపల్లి గ్రామంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మంకీ క్యాప్‌లు ధరించి రాత్రుళ్లు సంచరిస్తూ పలు ఇళ్ల తలుపులు తడుతున్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. నలుగురు వ్యక్తులు ముఖం కనిపించకుండా మంకీ క్యాపులు ధరించి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కొందరి ఇళ్ల తలుపుతడుతూ చప్పుడు చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. వేసవికాలం కాబట్టి ఆరుబయట నిద్రిస్తున్నామని, ఈ అగంతకుల సంచారంతో నిద్రిస్తున్న వారిని ఏం చేస్తారోనని బిక్కుబిక్కుమంటు నిద్రిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు నిరుపయోగంగా ఉన్నాయని వాటిని పట్టించుకునే వారే లేరని వాపోతున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశామని గ్రామస్తులు తెలిపారు.

ఒంటిగంటకు తలుపులు కొట్టారు



వారం వ్యవధిలో మూడిళ్ల తలుపులు కొట్టారు. ముఖాలు గుర్తుపట్టకుండా మంకీ క్యాప్ ధరించారు. ఒంటిగంట ప్రాంతంలో మా ఇంటి తలుపులు తట్టారు. నేను తలుపులు తీయలేదు.నాకు భయంవేసి చుట్టుపక్క వారికి ఫోన్‌చేశాను. ఎవరని గట్టిగా అరవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

- అంకం వెంకటేశ్


పెట్రోలింగ్ నిర్వహిస్తాం..



గుర్తుతెలియని వ్యక్తులు ముసుగు ధరించి అర్ధరాత్రి గ్రామంలో సంచరిస్తూ తలుపుతడుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తాం. అగంతకులను పట్టుకుంటాం.

- గుగులోత్ శ్రీదేవి, ఎస్సై

మేడేను విజయవంతం చేయాలి



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న సోమయ్య

జఫర్‌గఢ్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో వడ్లకొండ సుధాకర్ అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మేడే రోజున గ్రామ గ్రామాన ఎర్రజెండాలను ఎగురవేయడంతో పాటు ర్యాలీలు తీయాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, నాయకులు సుధాకర్, షబానా, యాకయ్య, అజయ్, రాములు, రేణుక, రాములు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

పాలకుర్తి: హమాలి కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న డిమాండ్ చేశారు. సోమవారం పాలకుర్తిలో జరిగిన హమాలీల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేడేను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. హమాలీలు అంబటి సోమయ్య, ఏనుగుతల వెంకన్న, ఎడవెల్లి కుమార్, ఎం.డి మహబూబ్, ఎల్లయ్య, పర్శరాములు, పెద్దపురం, భాస్కర్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే వ్యవసాయ బోరు
- నిర్లక్ష్యంగా స్టార్టర్ డబ్బా, వైర్లు



ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నర్మెట: గండిరామారం ప్రధాన రహదారికి పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, దాని పక్కనే వ్యవసాయ బోరు ఉంది. అలాగే దానికి పక్కనే నిర్లక్ష్యంగా పడవేసిన స్టార్టర్ బాక్స్ సర్వీసు వైర్లు ప్రమాదకరంగా మారాయి. మేతకు వచ్చే పశువులు, జీవాలు ప్రమాద బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రైతుగాని, విద్యుత్ సిబ్బందిగాని స్పందించాలని పలువురు కోరుతున్నారు.